

మల్లారెడ్డిగూడెంలోని అమరవీరుల స్మారక స్థూపం

పోరాటాలకు నిలయం..
మల్లారెడ్డిగూడెం

- రజాకార్లను తరిమికొట్టిన గ్రామస్తులు
- నాటి సాయుధ రైతాంగ పోరులో ఎనిమిది మంది ప్రాణత్యాగం

హుజూర్‌నగర్: నిజాం ప్రభుత్వ నిరంకుశ పాలన, రజాకార్ల దురాగతాలకు వ్యతిరేకంగా మల్లారెడ్డిగూడెం (ప్రస్తుతం చింతలపాలెం) గ్రామస్తులు తిరుగుబాటు చేశారు. నిజాం మిలటరీ, రజాకార్ల దురాగతాలను ఎండగడుతూ వారికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడారు. రజాకార్లు (నిజాం ప్రైవేట్ సైన్యం) గ్రామాలపై దండెత్తి ప్రజలపై అరాచకాలకు పాల్పడుతుండే వారు. రజాకార్ల ఆటకట్టించేందుకు అప్పట్లో కమ్యూనిస్టులు ఎదురు దాడులకు దిగేవారు. ఈ నేపథ్యంలో 1946లో హుజూర్‌నగర్ పాత తాలుకాలో దొడ్డా నర్సయ్య, చింతలపూడి రాములు, కోట నారాయణ కమ్యూనిస్టు దళనాయకులుగా ఉంటూ నిజాం సైన్యాన్ని గ్రామాల్లోకి రాకుండా అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేసేవారు. ఈ విషయాన్ని పసిగట్టిన రజాకార్లు 1946 డిసెంబర్ 1న నిజాం సైన్యం, రజాకార్లు కలిసి లారీల్లో వచ్చి మల్లారెడ్డిగూడెం గ్రామాన్ని చుట్టుముట్టారు. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు వారిని గ్రామంలోకి ప్రవేశించకుండా కారం పొట్లాలు, వడిసెలు, రాళ్లు, కర్రలతో ఎదురు దాడికి దిగారు. దీంతో నిజాం సైన్యం కాల్పులకు తెగబడింది. ఈ కాల్పుల్లో తొలుత యరబోలు అప్పిరెడ్డి, ముంగి వీరయ్య, నందిరెడ్డి నర్సిరెడ్డి అసువులు బాసారు. అటు తర్వాత 1948 ఆగస్టు నెలలో జరిపిన కాల్పుల్లో కందుల గోపిరెడ్డి, చింతిర్యాల రామస్వామి, 1949 జూలైలో జరిపిన కాల్పుల్లో పేరుపంగు భూషమ్మ, పేరుపంగు తిరపతమ్మ (తోటి కోడళ్లు), అలుగుల వీరమ్మతో కలిపి మొత్తం ఎనిమిది మంది అసువులు బాశారు. వీరి పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడానికి వారి జ్ఞాపకార్థ సీపీఐ ఆధ్వర్యంలో గ్రామ శివారులో అప్పట్లో ఒక స్మారక స్థూపం నిర్మించారు. ఈ స్థూపం వద్ద ఏటా సెప్టెంబర్ మాసంలో వారోత్సవాలను నిర్వహిస్తూ ఆ అమర వీరులను స్మరించుకుంటూ వారి కుటుంబ సభ్యులను సన్మానించడం ఆనవాయితీగా మారింది.

నాడు కుగ్రామం..
నేడు మండల కేంద్రం

నైజాం మిలటరీని ఎదిరించి పోరాడిన సమయంలో మల్లారెడ్డి గూడెం (రికార్డుల ప్రకారం చింతలపాలెం) దాదాపు 200 కుటుంబాలతో ఒక కుగ్రామంగా ఉండేది. కాలక్రమేణా ఆ కుగ్రామం గ్రామ పంచాయితీగా అవతరించింది. ప్రస్తుతం ఆ గ్రామం 16 గ్రామాలకు మండల కేంద్రంగా మారింది. ఇప్పుడది మండలంలో వ్యాపార, వాణిజ్య కూడలిగా మారింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రలకు సరిహద్దు మండలంగా కూడా ఉంది. ప్రస్తుతం ఇక్కడ మండల స్థాయిలో ఉండే అన్ని కార్యాలయాలతోపాటు రోడ్లు, వాణిజ్య భవనాలతో అభివృద్ధిపథంలో ముందుకెళ్తోంది.



దేశ్‌ముఖ్‌ను ఎదిరించిన 'బేతవోలు'

- బలవంతపు శిస్తు వసూళ్లపై గ్రామస్తుల పోరుబాట
- నాడు పీడిత గ్రామం.. నేడు అభివృద్ధిపథాన



కోదాడ: కోదాడ నియోజకవర్గంలో ఎక్కువ భాగం మునగాల పరగణా కింద బ్రిటీష్ పాలనలో ఉండగా కొంతభాగం మాత్రమే నిజాం నవాబు పాలనలో ఉండేది. దీనిలో ముఖ్యమైనది బేతవోలు ఫిర్కా. ఇది బేతవోలు కేంద్రంగా తడకమళ్ల రాంచందర్‌రావు అనే దేశ్‌ముఖ్ పాలనలో ఉండేది. ఇతను బేతవోలులో పెద్దగడిని నిర్మించుకొని పాలన చేసేవాడే. నిజాంకు కొద్దిగా కప్పం కడుతూ బేతవోలు ఫిర్కాలో ఉన్న దాదాపు 12 గ్రామాల నుంచి పన్నుల వసూలు చేసేవాడు. తనకున్న 1,100 ఎకరాల్లో ప్రజలకు వ్యవసాయ పనులను చేయించుకొని కూలీ ఇచ్చేవాడు కాదు. అధిక వడ్డీలు, బలవంతపు శిస్తులు వసూలు చేసేవాడు. కట్టని వారిని గడికి పిలిపించి క్రూరంగా శిక్షించేవాడు. కనీస సౌకర్యాలైన విద్య, వైద్యం ప్రజలకు అందించేవాడు కాదు. ఇతని దౌర్జన్యాలపై తిరగబడిన ఈ ప్రాంతంలో ఉన్న కమ్యూనిస్టులు ఇతనిపై దాడి చేయడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ క్రమంలో 1948లో సైనిక చర్య అనంతరం నిజాం నవాబు లొంగిపోవడంతో కమ్యూనిస్ట్ దళ నాయకుడు దొడ్డా నర్సయ్య నాయకత్వంలో వేలాదిమంది ప్రజలు గడిపై దాడి చేసి నేలమట్టం చేశారు. దీంతో ప్రజలు సంతోషంగా సంబురాలు చేసుకున్నారు.

వ్యవసాయ గ్రామంగా..

హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైన తరువాత బేతవోలు గ్రామం స్వరూపమే మారిపోయింది. గ్రామం మొత్తం సాగర్ ఎడమ కాలువ పరిధికి రావడంతో సాగు నీటి వసతి సమకూరింది. గ్రామంలో అతిపెద్ద చెరువు ఉండడంతో కరువు కాలంలో కూడా ఇక్కడ వరిపంట రెండు సీజన్లలో పండుతోంది. ప్రస్తుతం చిలుకూరు మండలంలో 100 వేల జనాభాతో మేజర్ గ్రామపంచాయతీగా ఉన్న ఈ గ్రామం మెరుగైన రవాణా సౌకర్యాలు సమకూరడంతో అభివృద్ధిపథంలో ముందుకెళ్తోంది. గ్రామంలో హైస్కూల్‌తోపాటు, రెండు ప్రాథమిక పాఠశాలలు, వైద్యశాల సౌకర్యం ఉంది. బేతవోలు విముక్తికి పోరాడిన దొడ్డా నర్సయ్య ఆ తరువాత హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా రెండు సార్లు విజయం సాధించాడు.

క్లుప్తంగా

కల్యాణ మండపం నిర్మాణానికి రూ.5 లక్షలు విరాళం



దాతను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పాలకవీడు : పాలకవీడు మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో గల శివాలయంలో కల్యాణ మండపం నిర్మాణానికి గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అదే గ్రామానికి చెందిన గుండ్ర వెంకట్‌రెడ్డి– కామేశ్వరమ్మ దంపతులు సోమవారం రూ.5 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు బూషిపల్లి వెంకట్‌రెడ్డి, కిష్టిపాటి అంజిరెడ్డి, వెంకటాచారి, మునగాల భాస్కర్‌రెడ్డి, వరగాని సత్యం, సారెడ్డి సీతారాం రెడ్డి, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న మైహోం సిమెంట్స్ పరిశ్రమ యాజమాన్యం

మేళ్లచెరువు: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మై హోం సిమెంట్స్ పరిశ్రమ హెడ్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. సోమవారం పరిశ్రమ భూముల్లో యాజమాన్యం, కార్మికులతో కలిసి ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. ప్రధాని మోదీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో మైన్స్ డిపార్ట్‌మెంట్ జనరల్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, అప్పలరాజు, డాక్టర్ నాగేశ్వరరావు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ పనులను పరిశీలిస్తున్న టీపీసీసీ అధికారి ప్రతినిధి

హుజూర్‌నగర్‌రూరల్ : ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు పడిన గండి మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని టీపీసీసీ అధికారి ప్రతినిధి దొంగరి వెంకటేశ్వర్లు కాంట్రాక్టర్‌కు సూచించారు. సోమవారం మండలంలోని కరక్కాయలగూడెం వద్ద గండి పడిన ప్రదేశంలో చే పడుతున్న మరమ్మతు పనులను ఆయన ప రిశీలించి మాట్లాడారు. పనులను రెండు రోజు ల్లో పూర్తి చేయించి నీటిని విడుదల చేయాలని కోరారు. హుజూర్‌నగర్ బ్లాక్ కా ంగ్రెస్ అధ్యక్షు డు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, నిజాముద్దీన్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, రైతులు ఉన్నారు.

గంగమ్మ ఒడికి గణనాథులు

కోదాడ : తొమ్మిది రోజులుగా భక్తుల పూజలు అందుకున్న గణనాథుడిని సోమవారం నిమజ్జనం చేశారు. భక్తులు కోలాహలం మధ్య, డప్పు చప్పులు, ప్రత్యేక నృత్యాలతో గణనాథులను ఊరేగింపుగా నిమజ్జనానికి తీసుకెళ్లారు. పట్టణంలోని రంగా థియేటర్ సెంటర్ వద్ద ఉత్సవ సమితి సభ్యులు వినాయకులకు స్వాగతం పలికారు. నిమజ్జనానికి వెళుతున్న గణనాథులకు కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని ప్రమీల, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరేగింపులో భద్రాచలం నుంచి వచ్చిన కోయలు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

హుజూర్‌నగర్ : పట్టణంలో సోమవారం గణేశ్ విగ్రహాల శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. అనంతరం కృష్ణానదిలో నిమజ్జనానికి తరలించారు. నిర్వాహకులు, భక్తులు, పాల్గొన్నారు.

రఘునాథపాలెంలో రూ.51వేలు పలికిన లడ్డూ

మఠంపల్లి : గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని రఘునాథపాలెంలో సోమవారం నిర్వహించిన వినాయకుని 51 కేజీల లడ్డూను వేలం పాటలో గ్రామానికి చెందిన మాఘం నరేష్ రూ.51 వేలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పందిరి పుల్లారెడ్డి, చింతల వెంకటనారాయణ, నరేష్, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రావిపహాడ్‌లో రూ.పదివేల పదహార్లు

మోతె : మండలంలోని రావిపహాడ్‌లో బస్టాండ్ సెంటర్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద లడ్డూను నిమ్మల లక్ష్మమ్మ రూ.పది వేల పదహార్లకు వేలం పాటలో దక్కించుకున్నారు. కార్యక్రమంలో కాంపాటి వెంకన్న వీరమల్ల వీరన్న, కుంచం రాములు, కిరణ్, ఎలుగు మధు, ఎలుగు శ్రీను, నిమ్మల నరేష్, గోపగాని రమేష్, పాల్గొన్నారు.



హుజూర్‌నగర్‌లో గణనాథుడి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



కోదాడ : పెద్దచెరువులో గణపతి నిమజ్జనం



చిలుకూరులో వినాయక నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్న చిన్నారులు



మేళ్లచెరువులో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



కోదాడ : నిమజ్జనానికి గణనాథులను పెద్ద చెరువు వద్దకు తీసుకొస్తున్న భక్తులు



నేరేడుచర్ల : రామాలయంలో వినాయకుడి లడ్డూను వేలంలో దక్కించుకున్న కొణతం సత్యనారాయణరెడ్డి



కోదాడ : గణనాథుడికి పూజలు చేస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి, చైర్‌పర్సన్ ప్రమీల



మఠంపల్లి : మట్టపల్లి వద్ద కృష్ణానదిలో నిమజ్జనం చేసేందుకు గణేశ్‌ని తీసుకెళ్తున్న వేద పాఠశాల విద్యార్థులు



కోదాడ : గుడిబండలో..



హుజూర్‌నగర్ : బుగ్గమాదారం వద్ద కృష్ణానదిలో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు



నడిగూడెంలో..



మోతె : రావిపహాడ్‌లో వేలం పాటలో దక్కించుకున్న లడ్డూ తీసుకెళ్తున్న భక్తురాలు



మఠంపల్లిలో గణేశ్ శోభాయాత్రలో కోలాటం వేస్తున్న మహిళలు, చిన్నారులు



చిలుకూరు : బేతవోలులో అన్నదానం చేస్తున్న నాయకులు, దాతలు



గరిడేపల్లిలో వినాయకుడి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



మఠంపల్లి : కృష్ణానది వద్ద గణనాథులను నిమజ్జనం చేస్తున్న భక్తులు

కృష్ణానదిలో నిమజ్జనాలను పర్యవేక్షించిన ఏఎస్పీ



విగ్రహాల నిమజ్జనాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ నాగేశ్వరరావు

మఠంపల్లి: మండలంలోని మట్టపల్లి వద్ద కృష్ణానదిలో జరుగుతున్న గణేశ్ విగ్రహాల నిమజ్జనాలను సోమవారం ఏఎస్పీ నాగేశ్వరరావు, కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ చరమందరాజు, ఎస్‌ఐ రామాంజనేయులుతో కలిసి పర్యవేక్షించారు. మట్టపల్లి నుంచి నదిలో పడవపై తిరుగుతూ పులిచింతల ప్రాజెక్టు పైభాగంలో గల చింతలపాలెం మండలం బుగ్గమాదారం తదితర రేవుల లో నిమజ్జనాలను పరిశీలించారు. ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు, ఇతర శాఖల సిబ్బందికి సూచించారు.

కృష్ణకుమారి సేవలు మరువలేనివి



కృష్ణకుమారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కోదాడ : జెడ్పీటీసీగా మందలపు కృష్ణకుమారి కోదాడ మండలానికి చేసిన సేవలు మరువలేనివని పలువురు నేతలు అన్నారు. సోమవారం కోదాడలో జరిగిన మాజీ జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి సంతాప సభలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణకుమారి ఆకస్మిక మృతి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ గుజ్జా దీపిక, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, సామినేని ప్రమీల, ముత్తవరపు పాండురంగారావు, లక్ష్మీనారాయణరెడ్డి, వంగవీటి రామారావు, పందిరి నాగిరెడ్డి, మహబూబ్ జానీ, బొలిశెట్టి నాగేంద్రబాబు, యాతాకుల మధుబాబు, చల్లా కొండల్‌రెడ్డి, పుల్లారావు, అల్తాఫ్ హుస్సేన్, గుండపనేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెంలో ర జక సంఘం గ్రామ కమిటీని సోమవారం ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాలెల్లి అంజయ్య, గ్రామ కుల పెద్ద సాకలిగా గూడెపు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా గూడెపు నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా పాలెల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కోమరాజు నాగయ్య, సహాయ కార్యదర్శిగా దూత వెంకట సైదులును ఎన్నుకున్నారు.

కనుల పండువగా ముత్యాలమ్మ జాతర



ముత్యాలమ్మకు పూజలు చేస్తున్న పూజారులు



ఆలయానికి బోనంతో వచ్చిన కుటుంబం



అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూ లైన్‌లో నిల్చున్న భక్తులు

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలో ముత్యాలమ్మ జాతర కనుల పండువగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా మూడు గుళ్లలో ఉన్న ముత్యాలమ్మ, అంకమ్మ అమ్మవార్లను సోమవారం పూజారులు పట్టువస్త్రాలు, పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పట్టణవాసులు మేకలు, కోళ్లను బలిచ్చి సాంప్రదాయబద్ధంగా మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఎడ్డుల బండ్లు, ట్రాక్టర్లపై అందంగా అలంకరించిన ప్రభలను పురవీధుల్లో ఊరేగించి ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులుభక్తులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న పంటలకు నీరందించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : ఎండిపోతున్న పంట పొలాలకు నీళ్ల వదిలి రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హుజూర్‌నగర్ మండలంలోని అమరవరం గ్రామంలో ఎండిపోయిన పంట పొలాలను సోమవారం రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అకాల వర్షాలకు కాల్వ కట్టలు, చెరువులు, కుంటలు తెగి 15 రోజులు అవుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఆయన వెంట రైతులు మాడూరి నిర్సంహాచారి, పారుపల్లి శ్రీనివాస్, అనిమిరెడ్డి, సైదిరెడ్డి, ఖాసిం, కృష్ణమూర్తి, గోపాలరావు, సీతారాములు, వెంకన్న, తదితరులు ఉన్నారు.

కార్మికుల శ్రేయస్సుకు చిత్తశుద్ధితో పనిచేయాలి

హుజూర్‌నగర్ : కార్మికుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయాలని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని తెలంగాణ శిల్ప కళా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి జాయింట్ యాక్షన్ కమిటీ రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాటాడారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని వారు తప్పుపట్టారు.. దీనికి వ్యతిరేకంగా సెప్టెంబర్ 18న జిల్లా కలెక్టరేట్ల ముందు ధర్నా, 23న లేబర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్మిక సంఘాల నాయకులు వై.సోమయ్య, టి.కుమార్, పి.ఉపేందర్, డి.వినాయకరావు, వేణు, రాంబాబు, లింగయ్య, జనార్దన్, వంశీ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాలకు చేరిన బియ్యం

సాక్షి ఎఫెక్ట్..

చిలుకూరు : ప్రతి నెలా రెండు, మూడో తేదీ లోపు రేషన్ షాపులకు చేరాల్సిన రేషన్ బియ్యం ఈ నెల పంపిణీ చేసే గడువు తేదీ ముగుస్తున్నా నేటికీ రేషన్ షాపులకు చేరకపోవడంతో సోమవారం సాక్షి పత్రికలో 'రేషన్ బియ్యం రాలే'అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి సివిల్ సప్లై, గోదాము అధికారులు స్పందించారు. స్టేజీ–1 నుంచి కోదాడలోని గోదాముకు రేషన్ బియ్యం సరఫరా చేశారు. అక్కడ నుంచి చిలుకూరు మండలంలోని 4 రేషన్ దుకాణాలు, కోదాడ మండలం, పట్టణంలో 9, అనంతగిరి మండలంలో ఒక రేషన్ షాపుకు రేషన్ బియ్యం పంపిణీ చేశారు. దీంతో డీలర్లు, లబ్ధిదారుల సమస్య పరిష్కారమైంది. ఈ సందర్భంగా లబ్ధిదారులు, డీలర్లు సాక్షికి ధన్యవాదాలు తెలిపారు.